దేశంలో మహిళలకు భద్రత కరువు

హైదరాబాద్ పర్యటనలో రాబర్ట్ వాద్రా వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేయబోతున్న ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీకి ఆమె భర్త రాబర్ట్ వాద్రా శుభాకాంక్షలు తెలిపారు. రెండు రోజుల పర్యటనకు రాబర్ట్ వాద్రా శుక్రవారం హైదరాబాద్ వచ్చారు. పలు ఆలయాలు సందర్శించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తాను ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చానని చెప్పారు. దేశంలో మహిళల భద్రత ప్రధాన సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య, కూతురు భద్రత విషయంలోనూ అప్పుడప్పుడు ఆందోళనగా అనిపిస్తుందని చెప్పారు. మహిళలతో ఎలా ప్రవర్తించాలో ఇంట్లో నేర్పితేనే అది సాధ్యం అవుతుందన్నారు. ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ కూడా చెప్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో తాను పవర్ సెంటర్ కావడంపై కాలమే నిర్ణయిస్తుందని చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఐదేండ్ల తర్వాత ఆ మార్పును చూస్తారని అన్నారు.

ఖజానాను నింపేదెలా?

- ప్రజలకు భారం కాకుండా ఆదాయం పెంపుపై దృష్టి
- కొత్త ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి
- సమీక్షలో అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ప్రజలపైన ఎలాంటి పన్నుల భారం వేయకుండా ప్రభుత్వ అవసరాలను, ఆలోచనలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల్లో ప్రత్యామ్నాయ ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఖజానాను నింపేందుకు ఆదాయం పెంపుపై జరిగే సమావేశానికి కొత్త ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని రావాలని సూచించారు. ఖజానాను నింపేందుకు ఆయా శాఖల్లో స్వేచ్ఛ గా నిర్ణయాలు తీసుకొని ఫలితాలు సాధించాలని చెప్పారు. అందరికీ ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు పట్టణాలకు సమీపంలో సబ్ యార్డులు, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మార్కెట్ యార్డుల్లో ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని మైనింగ్‌శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు.. ఇప్పటివరకు సమకూరిన ఆదాయం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఏ మేరకు రాబడిని అంచనా వేయవచ్చు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ ప్రణాళికలు, అసైన్డ్ భూములు, కోర్టు వివాదాలను సమీక్షించారు. రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరుల్లో జీఎస్టీ ఒకటి... లీకేజీలను అరికట్టి ఆదాయం పెంచేందుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ కమిషనర్ రిజ్వీ, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, రవాణాశాఖ కమిషనర్ బుద్ధప్రకాశ్, హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ గౌతం, మైనింగ్‌శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ సుశీల్, పరిశ్రమలశాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక పన్నులతో బాదుడే!

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా ఈ ఏడాది రూ.18,229 కోట్లు పిండుకోనున్న ప్రభుత్వం
- 80 రకాల సేవలపై స్టాంప్‌డ్యూటీ
- జీహెచ్‌ఎంసీలో ఇంటింటి సర్వే
- బస్సు చార్జీలు పెంచే యోచన

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): పన్నులతో ప్రజలను వీరబాదుడు బాదిభారీ మొత్తంలో ఆదాయాన్ని సమీకరించుకొనేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవుతున్నది. అందులో భాగంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని నిబంధనలను మరింత విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నది. స్థిరాస్తి క్రయవిక్రయాలు, గిఫ్ట్‌డీడ్‌లు, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లతోపాటు ఫ్రాంచైజీ ఒప్పందాలు, రియల్ ఎస్టేట్ ఒప్పందాలు, పుస్తకాల కాపీరైట్స్, ప్రకటనలపై కూడా స్టాంప్ డ్యూటీ వసూలు చేయాలని, తద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18,228.82 కోట్లు రాబట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి, పెద్దమొత్తంలో ఆస్తి పన్ను రాబట్టుకొనేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇది కార్యరూపం దాల్చితే ప్రయాణికులకు పెను భారం తప్పదు. ఈ నేపథ్యంలో బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని పునరాలోచించాలని ఇప్పటికే పలు వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

రూ.4 వేల కోట్ల అదనపు భారం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.12,372.73 కోట్లు, 2022-23లో రూ.14,228.18 కోట్లు, 2023-24లో రూ.14,295.56 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో దీన్ని మరో రూ.4 వేల కోట్లకుపైగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో రేవంత్‌రెడ్డి సర్కారు ప్రకటించింది. దీనిలో భాగంగా భూముల మార్కెట్ విలువ, వాస్తవిక ధరలను పరిగణనలోకి తీసుకొని భూముల విలువలను నిర్ణయించడంతోపాటు రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు, ఫీజుల చెల్లింపులు, తదితర సుమారు 80 సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావడం ద్వారా రాష్ట్ర రాబడిని పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసింది. దీంతో భవిష్యత్తులో స్థిరాస్తుల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు చేసుకునే వారిపై మరింత భారం పడటం ఖాయమని రియల్ ఎస్టేట్ నిపుణులు చెప్తున్నారు.

ఇంటింటి సర్వేతో ఆస్తిపన్ను పెంపు

పెద్ద మొత్తంలో ఆస్తిపన్నును రాబట్టుకునేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వేను ప్రారంభించింది. ఈ సర్వేలో ప్రజల ఆస్తుల విలువను అంచనా వేసి, తదనుగుణంగా పన్నులు పెంచుతారు. ఆస్తిపన్ను ఎగ్గొడుతున్న వారిపై జీహెచ్‌ఎంసీ ఇప్పటికే దృష్టి పెట్టింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 19 లక్షల నిర్మాణాలు ఆస్తి పన్ను పరిధిలో ఉన్నాయి. వాటి ద్వారా రూ.1,900 కోట్ల ఆదాయం వస్తున్నది. చాలా భవనాలను నివాసేతర అవసరాలకు వినియోగిస్తున్నప్పటికీ వాటి యజమానులు నివాస క్యాటగిరీ కింద పన్నులు చెల్లిస్తున్నారు. ఐదంతస్తుల భవనంలో రెండు, మూడు అంతస్తులకే పన్నులు కడుతున్నారు. బడా నిర్మాణాలు ఎగ్గొడుతున్న పన్ను విలువ 90% మేరకు ఉంటుందని అంచనా. ఇలాంటి అవకతవకలను సరిదిద్ది, పన్ను రాబడిని పెంచేందుకు జీహెచ్‌ఎంసీ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సర్వేను మొదలుపెట్టింది. మూడు దశల్లో ఈ సర్వే చేసి ఆస్తిపన్ను మదింపు చేయాలని జీహెచ్‌ఎంసీ రెవెన్యూ విభాగం నిర్ణయించింది. దీంతో పన్ను పరిధిలోకి వచ్చే నిర్మాణాల సంఖ్య 25 లక్షలు దాటుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఉత్తమ్ సీఎం అవుతరు నా నాలుకపై మచ్చలున్నయ్ నేను చెప్పానంటే అయి తీరుతది

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): 'నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భవిష్యత్తులో ఎప్పుడో ఒకసారి తప్పకుండా ముఖ్యమంత్రి అవుతరు. నా నాలుకపై మచ్చలు ఉన్నయి. నేను అన్నది అవుతది. భవిష్యత్తులో ఆయన సీఎం అయ్యే అవకాశం ఉన్నది' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో పార్లమెంట్ స్థాయి నీటి పారుదల పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలు మూసీ కాలుష్యంతో బాధపడుతున్నారని, హైదరాబాద్ కాలుష్యమే గాక జిల్లాలోని రసాయన కంపెనీ వ్యర్థాలు మూసీలో కలుస్తున్నాయని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని పేర్కొన్నారు. బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల మీద అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై తాను సంతృప్తిగా లేనని, వాటిని రీ డిజైన్ చేయాలని సూచించారు.

20రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ కార్యదర్శులు

హైదరాబాద్, ఆగస్టు30 (నమస్తే తెలంగాణ): 20 రాష్ట్రాలకు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను నియమిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణకు ఏఐసీసీ సెక్రటరీగా పీసీ విష్ణునాథ్, జాయింట్ సెక్రటరీగా విశ్వనాథన్‌ను నియమించింది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను ఛత్తీస్‌గడ్ కాంగ్రెస్ సెక్రటరీగా నియమించింది. ఇక ఏపీ సెక్రటరీ గణేశ్‌కుమార్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా పాలక్‌వర్మను ఏఐసీసీ ప్రకటించింది.

ఏడు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ఏడు మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ వ్యవసాయశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు 39 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. మహబూబ్‌నగర్, జగిత్యాల జిల్లాలోని వెల్గటూరు, కామారెడ్డి జిల్లాలోని గాంధారి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, మద్దులపల్లి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించింది.

'వాహన్'లోకి ఆర్టీఏ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ఒకే దేశం-ఒకే పోర్టల్ పేరిట కేంద్రం.. రవాణాశాఖలో తీసుకొచ్చిన వాహన్ పోర్టల్‌లో మరో రెండు వారాల్లో రాష్ట్రం చేరబోతున్నది. 2019లోనే పోర్టల్ అందుబాటులోకి వచ్చినా సీఎఫ్ఎస్‌టీ సాఫ్ట్‌వేర్ సులభతరంగా ఉండటంతో అప్పటి ప్రభుత్వం ఆ వైపుగా ఆలోచించలేదు. ప్రస్తుతం సీఎఫ్ఎస్‌టీకి బదులుగా వాహన్ పోర్టల్‌లో ఆర్టీఏ చేర్చడానికి ప్రణాళికలు రచించారు. తొలుత సికింద్రాబాద్ నుంచి పోర్టల్ సేవలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే రవాణాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా జారీ చేస్తున్న ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కేంద్ర రవాణాశాఖ నిబంధనల మేరకు ఉన్నాయి. ఇది అందుబాటులోకి వస్తే దేశంలో ఎక్కడి నుంచైనా ఆర్టీఏ సేవలు పొందవచ్చు.

'టామ్‌కామ్'లో దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): సౌదీ అరేబియాలోని వేర్‌హౌజ్ అసోసియేట్స్ ఉద్యోగాలకు టామ్‌కామ్ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 7013361343, 9985483931 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. మల్లెపల్లి క్యాంపస్ ఐటీఐ కాలేజీలో 4న ఎన్‌రోల్‌మెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

5,748 స్కూళ్లల్లో సెల్ఫ్ డిఫెన్స్

హైదరాబాద్, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): సర్కారీ స్కూళ్లలోని బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. 5,748 బడుల్లో సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను అమలుచేయనున్నారు. 3 మాసాలపాటు అందించే శిక్షణ ఈ నెల నుంచి ప్రారంభంకానుంది. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు శిక్షణ కొనసాగుతుంది. మార్గదర్శకాలతోపాటు, రూ.7.32 కోట్ల నిధులను విద్యాశాఖ అధికారులు మంజూరుచేశారు. మార్షల్ ఆర్ట్స్‌తోపాటు, సెల్ఫ్ డిఫెన్స్, పౌష్టికాహారాన్ని తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తారు. కుంగ్ ఫూ, కరాటే, జూడో లాంటి మార్షల్ ఆర్ట్స్‌లోని ముఖ్యమైన సెల్ఫ్ డిఫెన్స్ చిట్కాలపై శిక్షణ ఉంటుంది.

యాదగిరిగుట్టకు టెంపుల్ బోర్డు

- బంగారం తాపడం వేగవంతం చేయాలి
- ఆలయాభివృద్ధి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- టూరిజం అభివృద్ధి కోసం కొత్త పాలసీకి ఆదేశం

సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందజేస్తున్న వేములవాడ ఆలయ అర్చకులు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. యాదగిరిగుట్ట అభివృద్ధిపై శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పెండింగ్ పనుల వివరాల నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనులను అర్ధాంతరంగా వదిలేయడానికి వీల్లేదని చెప్పారు. భక్తులకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాల మేరకు చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన వివరాలు అందించాలని కోరారు. ఆలయ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి స్టేటస్ రిపోర్టు తనకు అందించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యాలు, విడిది కాటేజీల నిర్మాణాలకు దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. కీసరగుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించాలని చెప్పారు.

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి కొత్త పాలసీ రూపొందించాలని శుక్రవారం సచివాలయంలో స్పీడ్ ప్రాజెక్టులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లోని బెస్ట్ పాలసీలను అధ్యయనం చేయాలని, ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి ప్రాంతంలో 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని చెప్పారు. హైదరాబాద్ బయట దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వనరుల అభివృద్ధికి అవసరమైన చోట పీపీపీ విధానాన్ని అవలంబించాలని సూచించారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శుక్రవారమే సీఎం రేవంత్‌రెడ్డిని వేములవాడ ఆలయ అర్చకులు కలిసి ఆశీర్వచనం అందించారు. ఆలయ విస్తరణ డిజైన్ల నమూనాకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని ఆలయ అర్చకులు సీఎంకు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేశ్, డీఈఈ రఘునందన్, ప్రధాన అర్చకుడు ఉమేశ్ శర్మ తదితరులు ఉన్నారు.

నన్ను మన్నించండి

మొదటిపేజీ తరువాయి...

ఒప్పుకోకుండా.. 'కొందరు వ్యక్తులు నా వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేశారు' అంటూ మీడియాపై నెపం మోపారు. 'భారత న్యాయ వ్యవస్థపై నాకు అపారమైన గౌరవం ఉన్నది. సుప్రీంకోర్టు స్వతంత్ర తను నేను ప్రశ్నించాననే భావన కలిగించేలా ఈ నెల 29న మీడియాలో కామెంట్లు వచ్చాయని గుర్తించాను. న్యాయవ్యవస్థను నమ్మి, గౌరవించే వ్యక్తిగా.. మీడియాలో వచ్చిన కామెంట్ల పట్ల నేను బేషరతుగా క్షమాపణలు చెప్తున్నాను. న్యాయ వ్యవస్థ స్వేచ్ఛపై నాకు అపారమైన నమ్మకం ఉన్నది. నేను చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించి ప్రచారం చేశారు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ధర్మాసనం తలంటితేనే గుర్తుకొచ్చిందా?

సీఎం రేవంత్‌రెడ్డి తన తప్పును ఒప్పుకోకుండా.. మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరించిందని చెప్పడంపై జర్నలిస్టు వర్గాల్లో, రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. సీఎం స్పష్టంగా అన్న మాటలను యథావిధిగా ప్రచురిస్తే వక్రీకరించారని ఎలా అంటారని ప్రశ్నిస్తున్నారు. సీఎం కామెంట్లు బుధవారం టీవీల్లో, వెబ్‌సైట్లలో, గురువారం ఉదయానికి పేపర్లలో ప్రచురితమయ్యాయి. ఒకవేళ మీడియా వక్రీకరిస్తే వెంటనే ఎందుకు ఖండనగానీ, వివరణ కానీ ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. గురువారం మధ్యాహ్న భోజన విరామం తర్వాత ధర్మాసనం సీఎం వ్యాఖ్యలను ప్రస్తావించి, చీవాట్లు పెడితే.. శుక్రవారం ఉదయానికి జ్ఞానోదయం అయ్యిందా? అని మండిపడుతున్నారు. ధర్మాసనం తలంటితేనే మీడియా వక్రీకరించిందని రెండు రోజుల తర్వాత గుర్తుకువచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ బీజేపీ-బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగా కవితకు బెయిల్ వచ్చినట్టు భావిస్తే.. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీకి బీజేపీ-కాంగ్రెస్ ఒప్పందం మేరకు బెయిల్ వచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు. ఇండియా కూటమి నేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాకు కూడా బెయిల్ వచ్చిందని ఈ లెక్కన బీజేపీతో ఆప్ స్నేహం చేసినట్టా? అని నిలదీస్తున్నారు.

నేను మాట్లాడినప్పుడు ఈటల ఎక్కడ?

- ఎంపీ హోదాలో చౌకబారు వ్యాఖ్యలు సరికాదు
- రేవంత్‌రెడ్డిని పొగిడినట్టు వీడియో చూపెట్టండి
- లేదంటే బహిరంగ క్షమాపణలు చెప్పండి
- ఈటలపై ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తన మాటలను వక్రీకరించి మీడియాలో ఇష్టారీతిన మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్ రాజీనామా చేయాలని, లేదా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తర్వాత ఈటల రాజేందర్ తనపై చౌకబారు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. 'నేను ఏ వీడియోలో రేవంత్‌రెడ్డి గొప్ప సంఘ సంస్కర్త, ప్రగతి కాముకుడు అని చెప్పానో మాపాలి. లేకపోతే పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేయాలి. కాదంటే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. హైడ్రా విషయంలో బీజేపీ వైఖరి ఏంటో చెప్పి.. ఆ తర్వాత మాట్లాడండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత ఈటల రాజేందర్ నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపింది నిజం కాదా? ఇకముందు కూడా కాంగ్రెస్‌లో చేరబోనని గ్యారెంటీ ఇవ్వగలరా ?శాశ్వతంగా బీజేపీలోనే ఉంటానని చెప్పగలరా? ఇతరులపై చౌకబారు వ్యాఖ్యలు చెప్పేముందు గతం ఒక్కసారి చూసుకోవాలి' అంటూ హితవు పలికారు.

మంత్రిగా మాట్లాడలేదేమీ?

'బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ బడాబాబుల అక్రమాలపై ఎందుకు మాట్లాడలేదు? నేను ఎప్పట్నుంచో పేదల గురించి మాట్లాడుతున్నా. ఉద్యమకాలం నుంచి ఎన్ కన్వెన్షన్, పద్మాలయ స్టూడియో, లగడపాటి ల్యాంకోహిల్స్, అయ్యప్పసొసైటీ వంటి వాటిపై గళమెత్తాను. నాడు ఎమ్మెల్సీగా జిల్లెలగూడ చెరువు, మంత్రాల చెరువు, మీర్‌పేట్ చెరువుల గురించి ప్రస్తావించా. మేము పేదల గురించి పోట్లాడుతుంటే మీరు ఎక్కడున్నారు ఈటల రాజేందర్?' అని ప్రశ్నించారు. ఈటల కంటే ముందే.. హైడ్రా కమిషనర్‌తో పేదల ఇండ్ల గురించి ప్రస్తావించినట్టు చెప్పారు. తాను జెండాలు, ఎజెండాలు మార్చే సూడోపొలిటీషియన్‌ను కాదని, తనపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రెండేండ్లలో దేవాదుల పూర్తి

- సోనియాగాంధీతో ప్రారంభిస్తాం
- 300 రోజులు నీళ్లు ఎత్తిపోస్తం
- భువనగిరిలో లక్షల ఎకరాలకు సాగునీళ్లు
- ప్రాజెక్టుల్లోని సిల్ట్‌ను ఎత్తిపోస్తం
- కెనాళ్లలో జంగిల్ కటింగ్ చేస్తం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బరాజ్ వద్ద మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క

యాదాద్రి భువనగిరి/ములుగు, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రెండేండ్లలో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి, సోనియాగాంధీతో ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర శివారులో భువనగిరి పార్లమెంట్ స్థాయి నీటిపారుదల పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు. అంతకు ముందు అనాజిపురంలో బునాదిగాని కాల్వను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న దేవాదుల పంపుహౌస్, మోటర్ల పనితీరును మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క అధికారులతో కలిసి పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఆ శాఖ ఈఅండ్‌సీ, సీతలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు పనులు పదేళ్లుగా కుంటుపడ్డాయన్నారు. శంకుస్థాపనను 2008లో సోనియాగాంధీ చేశారని, పనులను 2026 మార్చి వరకు పూర్తి చేసి తిరిగి సోనియా గాంధీ ప్రారంభిస్తారనిమని చెప్పారు. 300 రోజుల పాటు నీళ్లను లిఫ్ట్ చేసి ఎత్తిపోతల ద్వారా 60 టీఎంసీ గోదావరి జలాలను దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీటితో పాటు తాగునీటిగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. మోడికుంట, సమ్మక్క బరాజ్‌కు అనుమతులను సాధిస్తామని, 1.4 టీఎంసీలతో గంధమల్ల రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. 'కాళేశ్వరంపై కొంత అయోమయం ఉంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉంది. నేషనల్ డ్యామ్ అథారిటీతో పలు మార్లు టెస్టింగ్ చేయించాం. బ్యారేజీ, డిజైన్, నిర్మాణం, మెయింటెనెన్స్‌లో తీవ్ర లోపాలు ఉన్నాయని తేల్చారు. మూడు కూడా కొలాప్స్ అయ్యే పరిస్థితి ఉంది' అని ఉత్తమ్ చెప్పారు.

ఇంకా 13వేల కోట్ల రుణమాఫీ: పొంగులేటి

31వేల కోట్ల రుణమాఫీలో ఇప్పటివరకు రూ. 18 వేల కోట్లు మాఫీ చేశామని, మిగతా రూ.13 వేల కోట్లు త్వరగా మాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 40 రోజుల్లోపు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యేలు ముగ్గుపోసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. ధరణి ప్రక్షాళన చేస్తామని, ల్యాండ్ రెవెన్యూ చట్టాన్ని దేశంలోనే రోల్ మోడల్‌గా చేస్తామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డులను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం: సీతక్క

రామప్ప నుంచి లక్నవరానికి గ్రావిటీ కెనాల్‌లో భూములు కోల్పోయే నిర్వాసితులకు తగిన విధంగా నష్టపరిహారం అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. సమావేశాల్లో ప్రభుత్వ విప్ ఐలయ్య, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సామేల్, వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కడియం శ్రీహరి, యశస్వినీరెడ్డి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు